

www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

మంగళవారం | 27 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08




# ఆత్మీయతకు ప్రతీక అలయ్ బలయ్

### టిఆర్ఎస్ ఆధ్వర్యంలో అలయ్ బలయ్

### టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్





**తిరుమలగిరి, అక్షిత న్యూస్ :** తెలంగాణ సంస్కృతికి ఉట్టిపడేలా అలయ్ బలయ్అలరించింది. కులాలు.. మతాలకు అతీతంగా సంస్కృతికి ప్రతీకగా ఐక్యతను చాటింది. టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తుంగతుర్తి నియోజక వర్గం లోని తిరుమలగిరి మండల కేంద్రంలో దసరా పండుగ అనంతరం సోమవారం నాడు అలయ్ బలయ్ కార్యక్రమాన్ని తెలంగాణ తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలగిరి మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో కలిసి అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ ముఖ్యాంశాలను కార్యకర్తలకు వివరించి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు ముందుకు పోవాలని పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ సూరారపు కృష్ణవేణి, ధరావత్ సైదమ్మ, మాధవి, జ్యోతిరెడ్డి, పిట్టల మహేష్, హరీష్, అన్వర్ పాషా, వైద్య సాయి, బాలవిందర్, శ్రీనివాస్, అడ్వైజర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# జల్.. జంగల్..జమీన్ యోధుడికి జోహార్ !

### ఆదివాసీ యోధుడికి ఘన నివాళులు

### కొమురం భీశీ ఆశయ సాధనకు కృషి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**అదిలాబాద్, అక్షిత బ్యూరో :** ఆదివాసీ ఆత్మబంధువు కొమురం భీశీకు జోహార్. జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ సమీపంలోని కొమురం భీమ్ విగ్రహం వద్ద ఆయన 86 వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా

..మిగతా 2లో

# పేదింటికి ఆహార భద్రత

### పేదలందరికి రేషన్ కార్డులు

### జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి





**జడ్చర్ల, అక్షిత న్యూస్:** నిరుపేదలకు అందజేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడ, గుండ్ల పొట్లపల్లి, అగ్రహారం పొట్లపల్లి గ్రామాల్లో, బీబీనగర్ తాండలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయని పరిస్థితి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తోందని తెలిపారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జడ్చర్ల నియోజకవర్గం లో పెండింగ్లో ఉన్న రోడ్ల బిల్లులను కాంట్రాక్టర్లకు ఇప్పించి, అసంపూర్తిగా ఉన్న రోడ్ల ..మిగతా 2లో

### జ్ఞానంతోనే మనిషి

# జీవితంలో మార్పు

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**సూర్యాపేట, అక్షిత బ్యూరో :** జ్ఞానంతోనే మనిషి జీవితంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాధారణ జీవితం నుంచి ఉన్నత స్థాయికి ఎదగడానికి జ్ఞానం ఎంతో అవసరమని కలెక్టర్ చెప్పారు. జ్ఞానాన్ని సంపాదించడంతో పాటు దానిని ఆచరణలో పెట్టినప్పుడే వ్యక్తిగతంగా, సామాజికంగా మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. మనలో మార్పు వస్తే ..మిగతా 2లో

## పేదింటికి ఆహార భద్రత

మొదటి పేజీ తరువాయి...

పనులన్నింటినీ పూర్తి చేయిస్తానని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రభుత్వంతో పోరాడైనా బిల్లులు మంజూరు చేయిస్తానని, బిల్లులు విడుదల చేయకపోతే అధికారంలో ఉన్నప్పటికీ ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ పోరాటం చేస్తానని వెల్లడించారు. ఉదండాపూర్ రిజర్వాయర్ రైట్ కెనాల్ పూర్తయితే ఆయా గ్రామాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. పాలమూరు ఎత్తిపోతల పథకం నీటిని ఈ ప్రాంత రైతుల ప్రయోజనాలకే వినియోగించేలా చర్యలు తీసుకుంటామని, ఒక్క చుక్క నీరు కూడా బయటకు పోనివ్వబోమని స్పష్టం చేశారు. తండాలలో మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు.

## జ్ఞానంతోనే మనిషి జీవితంలో మార్పు

మొదటి పేజీ తరువాయి...

సమాజంలోనూ మార్పు వస్తుందని పేర్కొన్నారు.మహర్షి వాల్మీకి జీవితం నుంచి కరుణ, దయ వంటి గొప్ప విలువలను నేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. మనుషులతో పాటు పశుపక్ష్యాదులకు కూడా ఈ ప్రపంచంలో జీవించే హక్కు ఉందని చెప్పారు. ప్రతి జీవిపై ప్రేమ,దయతో వ్యవహరించాలని, మానవత్వాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలని కోరారు. వేల సంవత్సరాల క్రితం వెలుగులోకి వచ్చిన రామాయణం నేటికీ ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తోందని అన్నారు. కాలంతో పాటు సాంకేతికత మారుతున్నా, మానవ విలువలు మాత్రం శాశ్వతంగా ఉంటాయని చెప్పారు.భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమలోని చెడు లక్షణాలను తగ్గించుకుంటూ మంచి గుణాలను పెంపొందించుకోవాలని అన్నారు. అప్పుడే జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్,జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్,జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి పెండెం వెంకటరమణ,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలను పర్యటించాలి

**ఎల్.నినో పరిస్థితులపై సమీక్షించాలి**

**కలెక్టర్ ఖుష్బూ గుప్తా**




**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించాలని,ఆయా గ్రామాల్లో ఎల్.నినో పరిస్థితులపై సమీక్షించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజావాణి అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో మండల ప్రత్యేక అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యటనలపై సమీక్షించారు. మండల ప్రత్యేక అధికారులు బుధవారం మండలం లోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేయడంతోపాటు, తమ శాఖలకు సంబంధించిన కార్యక్రమాల అమలు తీరును పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అధికారి వారంలో కనీసం రెండు నుంచి మూడు గ్రామపంచాయతీలను సందర్శించాలని, ప్రతి నెలా తమకు కేటాయించిన మండలాల్లోని గ్రామాలను క్రమం తప్పకుండా పర్యటించాలని సూచించారు. కేవలం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీని సందర్శించి సరిపెట్టకోకుండా, మారుమూల గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎల్ నీ నో పరిస్థితుల వల్ల గ్రామాలలో త్రాగు నీటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రత్యేక అధికారులు వాటి పై దృష్టి సారించి నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ డి. ఆర్.ఓ ఎ.నిర్మల, జెడ్.పి.సి.ఈ.ఓ, ఇన్చార్జి డి. పి.ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఒ నర్సింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జల్.. జంగల్..జమీన్ యోధుడికి జోహార్ !

మొదటి పేజీ తరువాయి...



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసి నాయకులు పాల్గొని కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాంజీ గోండు విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు ఆదివాసీ సంప్రదాయాలతో పూజ కార్యక్రమాలు నిర్వహించి కలెక్టర్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,కొమురం భీమ్ కేవలం ఆదివాసులతో పాటు మొత్తం జిల్లాకే మంచి మార్గదర్శి అని, ఆయన కోరుకున్న జల, జంగల్, జమీన్' సాధన కోసం అందరూ పాటుపడాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోడు పట్టాలు, రైతు భరోసా, ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ ఫలాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే పిల్లలను బడికి క్రమం తప్పకుండా పంపాలని, మూఢనమ్మకాలకు పోకుండా ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావం ఉన్నందున నీటి సంరక్షణ అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ జల సంరక్షణకు ప్రాధాన్యతనిచ్చి, ఇంకుడు గుంతలు, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ వంటి పద్ధతుల ద్వారా నీటిని వృథా చేయకుండా కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, కొమరం భీమ్ ఆశయ సాధనే లక్ష్యంగా జిల్లాలో గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, అధికారులు, గిరిజన నాయకులు సమన్వయంతో పనిచేసి సంక్షేమ ఫలాలను అర్హులందరికీ చేరవేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా బడికి పంపాలని, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సద్వినియోగం చేసుకుని పిల్లలను చదివిస్తే వారు ప్రపంచంతో పోటీపడే స్థాయికి ఎదుగుతారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడకుండా వైద్య సేవలందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, రిమ్స్ ఆసుపత్రితో పాటు గిరిజనుల కోసం ప్రత్యేకంగా అనువాదకులను (ట్రాన్స్లేటర్స్) సైతం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. చిన్నచిన్న సమస్యలను రాయి సెంటర్లు పోలీస్ స్టేషన్ల ద్వారా అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని సూచించారు. సారా తయారీ, విక్రయాలు, గంజాయి సాగు చట్టరీత్యా నేరమని, గంజాయి పండించినా, రవాణా చేసినా కఠిన శిక్షలు తప్పవని, ఇటీవల కాలంలో కొందరికి జైలు శిక్షలు పడినట్లు ఉదాహరణలతో వివరించారు. కావున ఆదివాసీ యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా, గంజాయి సాగుకు దూరంగా ఉంటూ తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.మున్సిపల్ చైర్ పర్సన్ అనూష మాట్లాడుతూ, ఆదివాసులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే కొమురం భీమ్ కు మనం ఇచ్చే నిజమైన నివాళులు అన్నారు. ప్రతి ఒక్కరు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో
# రెండు, మూడు రోజుల్లో భౌతిక తరగతులు

**విద్యార్థులకు నీటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు**

**రెండు మోటార్ల మరమ్మతులకు రూ.8 లక్షలు కేటాయింపు**





**నిర్మల్,అక్షిత ప్రతినిధి, అక్టోబర్ 26 :** బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో భౌతిక తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సోమవారం బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించిన కలెక్టర్.. గోదావరి నది వద్ద ఉన్న నీటి సరఫరా కేంద్రం, ప్రాంగణంలోని నీటి నిల్వ కుంట, పంపుహౌస్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిపి సుమారు 10 వేల మంది ఉంటారని, వారి తాగునీరు, ఇతర రోజువారీ అవసరాలకు రోజుకు దాదాపు 15 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుందని కలెక్టర్ వివరించారు. గోదావరి నది వద్ద ట్రిపుల్ ఐటీకి నీటిని సరఫరా చేసే 60 హెచ్పీ సామర్థ్యం గల మూడు మోటార్లు ఉండగా, ప్రస్తుతం ఒకటి మాత్రమే పూర్తిస్థాయిలో పనిచేస్తోందని తెలిపారు. పనిచేయని మరో రెండు మోటార్ల మరమ్మతులకు రూ.8 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ఇప్పటికే సాంకేతిక నిపుణుల బృందం ఇంటెక్వెల్ను పరిశీలించిందని, పది రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి మోటార్లను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

ప్రస్తుతం పనిచేస్తున్న మోటారు రోజుకు సుమారు 25 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయగలదని, ఇది ట్రిపుల్ ఐటీ రోజువారీ అవసరాలకు సరిపోతుందని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో పెరిగే నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో కొత్త మోటారును ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అవసరమైతే గ్రామపంచాయతీ ఇంటెక్వెల్ నుంచి అదనపు నీటిని సరఫరా చేయడంతోపాటు, ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని అందిస్తామని చెప్పారు.

ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో 29 ఎకరాల విస్తీర్ణంలో నీటి నిల్వ కుంట ఉందని, దానిని శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకువస్తామని వివరించారు. ప్రస్తుతం నీటి లభ్యతకు కొరత లేదని, సరఫరాలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని త్వరగా పరిష్కరించి విద్యార్థులకు నిరంతర నీటి సరఫరా అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రెండు, మూడు రోజుల్లో భౌతిక తరగతులు ప్రారంభించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

అంతకుముందు గోదావరి నది వద్ద ఉన్న ఇంటెక్వెల్ను పరిశీలించిన కలెక్టర్.. నీటి సరఫరాకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మోటార్లకు అవసరమైన పరికరాలను సమకూర్చి మరమ్మతులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలోని నీటి నిల్వ కుంట, పంపుహౌస్లను పరిశీలించారు.

ఈ పర్యటనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, గ్రిడ్ డీఈఈ, ఈఈలు రాజేశ్వర్రావు, రాఘవేంద్రరెడ్డి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపీడీవో దేవేందర్రెడ్డి, ట్రిపుల్ ఐటీ డీన్లు మహేష్, విఠల్, విద్యార్థి సంక్షేమ అధికారి నాగరాజు, సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు...

# కరీంనగర్ మట్టిలో 'శనార్తి' సందడి

**పల్లె నేపథ్యంలో వెండితెరపైకి మరో వినూత్న కథ**

**వెలిచాలలో ఘనంగా ప్రారంభమైన రెగ్యులర్ షూటింగ్**

**హీరో హీరోయిన్లుగా అఖిల్ రాజ్, నాగదుర్గ**

**సొంత జిల్లాలో తొలి చిత్రానికి శ్రీకారం చుట్టిన దర్శకుడు గణేష్ రాజ్ ఉప్పునూటి**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** తెలంగాణ పల్లె సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ జీవనశైలిని వెండితెరపై ఆవిష్కరించే దిశగా ప్రముఖ దర్శకుడు, నిర్మాత సంపత్ నంది మరో సరికొత్త ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. వైవిధ్యభరితమైన కథాంశాలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఆయన నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'శనార్తి' రెగ్యులర్ షూటింగ్ కరీంనగర్ జిల్లాలో ఘనంగా ప్రారంభమైంది. 'రాజ్ వెడ్స్ రాంబాయ్' చిత్రంతో గుర్తింపు పొందిన అఖిల్ రాజ్, ఫోక్ క్వీన్‌గా పేరొందిన నాగదుర్గ ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. గ్రామీణ నేపథ్యం, స్థానిక జీవనశైలి, తెలంగాణ మట్టి పరిమళాలను ప్రతిబింబించే కథాంశంతో ఈ సినిమా రూపొందుతుండటం విశేషం.

**"వెలిచాలలో పూజా కార్యక్రమాలు""**

కరీంనగర్ జిల్లా వెలిచాలలో సినిమా ప్రారంభోత్సవానికి సంబంధించిన పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. దర్శకుడు సంపత్ నంది, నిర్మాత కే.వి. శ్రీధర్ రెడ్డి సమక్షంలో చిత్ర బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, అనంతరం రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించింది. ఆదిత్య మూవీస్ సమర్పణలో సంపత్ నంది టీమ్ వర్క్స్, శ్రీ ధనలక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్లపై కే.వి. శ్రీధర్ రెడ్డి, సంపత్ నంది సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

**""సొంత గడ్డపై యువ దర్శకుడి తొలి అడుగు""**

ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న గణేష్ రాజ్ ఉప్పునూటి కరీంనగర్ జిల్లాలోని గట్టు బూత్కూర్ గ్రామానికి చెందినవారు. తన తొలి చిత్రాన్ని సొంత జిల్లా పరిసరాల్లోనే తెరకెక్కించేందుకు సిద్ధమవడం స్థానికంగా ఆసక్తిని కలిగిస్తోంది. సాధారణంగా సినీ చిత్రీకరణలు ప్రధాన నగరాలు, స్టూడియోలు, ఇతర ప్రాంతాల్లో సాగుతుండగా, ఈ చిత్రం కోసం కరీంనగర్ జిల్లా గ్రామీణ వాతావరణాన్ని ఎంచుకోవడం ప్రత్యేకతగా నిలుస్తోంది. సుమారు నెల రోజుల పాటు స్థానిక ప్రాంతాల్లో చిత్రీకరణ కొనసాగించేందుకు చిత్ర బృందం ప్రణాళిక రూపొందించింది.

యువ దర్శకుడిగా తన ప్రతిభను నిరూపించుకునేందుకు గణేష్ రాజ్‌కు ఈ చిత్రం కీలక వేదికగా నిలవనుంది. సొంత ప్రాంతంలోని ప్రజల జీవనశైలి, గ్రామీణ వాతావరణం, స్థానిక పరిసరాలపై అవగాహన కథను సహజంగా తెరకెక్కించేందుకు దోహదపడే అవకాశముంది.

""తెలంగాణ సంస్కృతికి వెండితెరపై ప్రాధాన్యం""

తెలంగాణ సంస్కృతి, పల్లె జీవన విధానం, స్థానిక సంప్రదాయాలు, ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబించే కథలకు ప్రేక్షకుల్లో ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో 'శనార్తి' చిత్రంపై ఆసక్తి నెలకొంది. గ్రామీణ నేపథ్యాన్ని సహజత్వంతో తెరపై చూపించడమే లక్ష్యంగా చిత్ర బృందం ముందుకు సాగుతోంది. స్థానిక వాతావరణంలో చిత్రీకరణ జరపడం వల్ల కథకు మరింత సహజత్వం చేకూరే అవకాశం ఉంది.

సినిమాలోని కథాంశం, పాత్రల రూపకల్పన, చిత్రీకరణ శైలి ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తాయని సినీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. అయితే సినిమా కథకు సంబంధించిన పూర్తి వివరాలను చిత్ర బృందం వెల్లడించాల్సి ఉంది.

**""అనుభవజ్ఞులైన సాంకేతిక బృందం""**

'శనార్తి' చిత్రానికి సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందిస్తున్నారు. విశ్వనాథ్ రెడ్డి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తుండగా, బేబీ సురేష్ భీమగాని ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. కథకు తగిన వాతావరణాన్ని తెరపై ఆవిష్కరించడంలో సంగీతం, ఛాయాగ్రహణం, కళా దర్శకత్వం కీలక పాత్ర పోషించనున్నాయి.

ఈ చిత్రంలో మై విలేజ్ షో రాజు, మురళీధర్ గౌడ్, సునందిని, సుంకర లక్ష్మి, రమేష్ నకిరికంటి, వైవా రెడ్డి, అంజి బాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రధాన పాత్రధారులతో పాటు అనుభవమున్న నటీనటులు భాగస్వాములు కావడం సినిమాపై అంచనాలను పెంచుతోంది.

**""కరీంనగర్‌కు సినీ రంగంలో మరో గుర్తింపు""**

సినిమా షూటింగ్‌లు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరగడం స్థానికంగా సినీ రంగంపై ఆసక్తిని పెంచడంతో పాటు, ప్రాంతీయ ప్రతిభకు అవకాశాలు కల్పించే వేదికగా నిలిచే అవకాశం ఉంది. స్థానిక ప్రాంతాలను చిత్రీకరణకు ఎంచుకోవడం వల్ల ఆ ప్రాంతాల ప్రత్యేకతలు విస్తృత ప్రేక్షకులకు పరిచయమయ్యే వీలుంటుంది. అయితే చిత్రీకరణ వల్ల స్థానికంగా ఎలాంటి ఉపాధి లేదా ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయన్నది చిత్ర నిర్మాణం సాగుతున్న కొద్దీ స్పష్టమవుతుంది.

మొత్తంగా, తెలంగాణ పల్లె నేపథ్యాన్ని ప్రధానంగా తీసుకుని రూపొందుతున్న 'శనార్తి' చిత్రం కరీంనగర్ జిల్లా సినీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సొంత గడ్డపై తొలి చిత్రాన్ని తెరకెక్కిస్తున్న దర్శకుడు గణేష్ రాజ్ ఉప్పునూటి, నిర్మాతలు సంపత్ నంది, కే.వి. శ్రీధర్ రెడ్డి ఈ సినిమాతో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటారోనని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. స్థానిక సంస్కృతి, సహజమైన కథనం, నటీనటుల ప్రదర్శనతో 'శనార్తి' ప్రేక్షకులను ఆకట్టుకుంటుందా అన్నది సినిమా విడుదల తర్వాత తేలనుంది.

# రక్తదానం.. ప్రాణదానం!

**సేవా స్ఫూర్తిని చాటిన షాద్‌నగర్ ఆటో, తుఫాన్ డ్రైవర్లు**

**పోలీస్ ఫ్లాగ్ డే వీక్--2026లో ట్రాఫిక్ పోలీసుల వినూత్న కార్యక్రమం**

**రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసిన ట్రాఫిక్ సిఐ వెంకటేష్**



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ.. ఆపన్నులకు ప్రాణదానమిస్తూ.. షాద్‌నగర్‌లో ఆటో, తుఫాన్ డ్రైవర్లు సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. పోలీస్ ఫ్లాగ్ డే వీక్--2026ను పురస్కరించుకుని షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో డ్రైవర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

**ప్రాణాలను కాపాడే మహత్తర సేవ**

అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎవరూ ప్రాణాపాయానికి గురికాకూడదనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**డ్రైవర్ల సేవకు పోలీసుల అభినందన**

నిత్యం ప్రజలకు రవాణా సేవలందించే ఆటో, తుఫాన్ డ్రైవర్లు సామాజిక సేవలోనూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించడం అభినందనీయమని పోలీసులు ప్రశంసించారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. పోలీస్ ఫ్లాగ్ డే వీక్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, సామాజిక సేవ పట్ల బాధ్యతను చాటిచెప్పింది.కార్యక్రమంలో షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటేష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్.ఎస్.పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం




**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆర్ఎస్పీ ఫౌండేషన్,ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహబూబ్నగర్, రంగారెడ్డి,హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు అవగాహన మరియు ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బావండ్ల మధు,కార్మిక సంఘం అధ్యక్షులు సూర్యప్రకాష్ రావు,మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు,కుడుముల మనోహర్ రెడ్డి, ఆర్య వైశ్య సంఘం నాయకులు దాచేపల్లి శ్రీనివాసులు,మండల మాజీ కోఆప్షన్ రుక్మొద్దీన్, బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్,ఉపసర్పంచ్ భీం, ఆర్ఎస్పి ఫౌండేషన్ సభ్యులు అశ్విన్,చందు,కిరణ్,రాము, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సురేష్ గౌడ్,బీమ్లా నాయక్,శ్రీరామ్,పూరి రమేష్,హనుమంతు తదితలు పాల్గొన్నారు.

# లోకేశ్వరం పీహెచ్‌సీలో అధికారుల ఆకస్మిక తనిఖీ...

**రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**

**డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఆకాశ్, డీపీఎంవో అర్ష ముత్తన్న...**



**లోకేశ్వరం,అక్టోబర్ 26 అక్షిత న్యూస్ :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఆకాశ్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్ (డీపీఎంవో) అర్ష ముత్తన్న సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వివిధ విభాగాలు, రికార్డులు, మందుల నిల్వలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు.

ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలని అధికారులకు ఈ సందర్భంగా సూచించారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటిస్తూ విధులకు సకాలంలో హాజరుకావాలని ఆదేశించారు.

అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు బాధ్యతాయుతంగా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, విధుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు...

## తెలంగాణ స్టేట్ గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టీ. కరుణాకర్

### గ్రాడ్యుయేట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### నూతన అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ లెక్చరర్ల ఫోరం అనుబంధ సంఘమైన తెలంగాణ స్టేట్ గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షాద్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ టీ. కరుణాకర్ నియమితులయ్యారు. తెలంగాణ లెక్చరర్ల ఫోరం చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ కత్తి వెంకటస్వామి, ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగినట్లు తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన టీ. కరుణాకర్‌కు తెలంగాణ స్టేట్ గ్రాడ్యుయేషన్ అసోసియేషన్‌లో కీలక బాధ్యతలు అప్పగించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆయన తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రాష్ట్రంలోని గ్రాడ్యుయేట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టీ. కరుణాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన తెలంగాణ లెక్చరర్ల ఫోరం చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ కత్తి వెంకటస్వామి, అధ్యక్షుడు రామకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ గ్రాడ్యుయేట్ల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకుని రాబోయే ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో గ్రాడ్యుయేట్లు చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కరుణాకర్ పిలుపునిచ్చారు.

## ప్రేమ్ నగర్ ప్రాథమిక పాఠశాలను వెంటనే పునఃప్రారంభించాలి

### కుల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ మౌర్య



**కాటారం, మంథని, అక్షిత ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా,మహాముత్తారం మండలంలోని ప్రేమ్ నగర్ ప్రాథమిక పాఠశాలను తక్షణమే పునఃప్రారంభించాలని కోరుతూ కుల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ మౌర్య భూపాలపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ప్రేమ్ నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు అందుబాటులో ఉన్నప్పటికీ, అక్కడి ఉపాధ్యాయుడిని వేరే పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఈ విద్యా సంవత్సరం జూన్ నెల నుండి ఈ పాఠశాలను మూసివేయడం జరిగింది.

పాఠశాల మూతపడటంతో ప్రేమ్ నగర్ ప్రాంతానికి చెందిన గిరిజన (ఎస్టీ) కమ్యూనిటీకి చెందిన పేద విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది.

బడిలో ఉండాల్సిన చిన్నారులు పాఠశాల లేకపోవడంతో పంట పొలాలకు, కూలి పనులకు వెళ్లవలసిన దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, మూతబడిన ప్రేమ్ నగర్ ప్రాథమిక పాఠశాలను వెంటనే తెరిపించి ఉపాధ్యాయులను కేటాయించాలని పీక కిరణ్ మౌర్య, ఐతే బాపు, జిల్లా అధికారులను కోరారు.

# నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం

### రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### గొప్ప బౌద్ధ క్షేత్రంగా తీర్చిదిద్దుతాం

### నేలకొండపల్లి బౌద్ధ స్తూప అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి





**ఖమ్మం/అక్షిత బ్యూరో :** పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లిలో ఉన్న 3వ శతాబ్దానికి చెందిన చారిత్రక బౌద్ధ స్తూపాన్ని పరిసర ప్రాంతాలను అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ హౌజింగ్ సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం నేలకొండపల్లిలో పర్యాటక సదుపాయాల కల్పన బౌద్ధ స్థల సంరక్షణ/పునరుద్ధరణ పనులకు మంత్రి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 3 వ శతాబ్దానికి చెందిన బౌద్ధ స్థూపాన్ని సుమారు 50-55 సంవత్సరాల క్రితం నేలకొండపల్లి గ్రామంలో గుర్తించారని దేశంలోనే అత్యంత పెద్ద బౌద్ధ స్తూపాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధిని ప్రారంభించినప్పటికీ పనులు పూర్తి చేయలేకపోయాయని అన్నారు. స్తూపం చుట్టూ ఉన్న ఒకటిన్నర కిలోమీటరు పరిధిలో పురావస్తు శాఖ అధికారులు గతంలో జరిపిన తవ్వకాల్లో ఎన్నో పురాతన వస్తువులు లభ్యమయ్యాయని వాటిని భద్రపరిచేందుకు స్థానికంగా వసతులు లేకపోవడంతో హైదరాబాద్ మ్యూజియంలో ఉంచారని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా వచ్చిన బౌద్ధ మతస్థులు స్థానికుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని రాబోయే రోజుల్లో బౌద్ధ కట్టడాలపై అవగాహన ఉన్న ప్రముఖ నిపుణులను అధికారులను ఇక్కడికి ఆహ్వానించి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రదేశాన్ని అభివృద్ధి చేయడానికి ఎంత ఖర్చయినా వెనుకాడబోమని బౌద్ధులకు ప్రత్యేకాకర్షణగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో ఇట్టి ప్రదేశాన్ని గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెరిటేజ్ శాఖ డైరెక్టర్ కుతాడి అర్జున్ రావు హెరిటేజ్ శాఖ ఉప సంచాలకులు నాగరాజు ఖమ్మం ఆర్డీవో ఎన్ శ్రీనివాస్ తహశీల్దార్ రాంప్రసాద్ కన్సల్టెంట్ శ్రీనివాస్ టూరిజం డీఈ రామకృష్ణ జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి నేలకొండపల్లి సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు రాయపూడి రామారావు పలు గ్రామాల సర్పంచ్ లు తేజవత్ శివాజీ బోయిన వేణు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొడాలి గోవింద్ ఎంపీడీవో తాసిల్దార్ వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## "ఓట్ బచావో - దేశ్ బచావో" మూడవ దశ కార్యాచరణ సమావేశము

### పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకులు కేబీఆర్ నాయుడు, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి




**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ ఆదేశాల ప్రకారం దేశవ్యాప్తంగా అక్రమ ఓట్ల తొలగింపునకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఓట్ బచావో -- దేశ్ బచావో" ఉద్యమ మూడవ దశ ప్రచార కార్యాచరణ,మార్గదర్శకాలపై సోమవారం హనుమకొండ జిల్లా డీసీసీ భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల విస్తృత స్థాయి సమన్వయ సమావేశం, మీడియా సమావేశం నిర్వహించరు.

ఈ సమావేశానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అబ్జర్వర్ కేబీఆర్ నాయుడు , టీపీసీసీ కోఆర్డినేటర్ అరికెల నర్సారెడ్డి హాజరయ్యారు.

ఏఐసీసీ పరిశీలకులు కేబీఆర్ నాయుడు, ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని అధికార పక్షం తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఓటర్ల జాబితా నుండి ఏకపక్షంగా, అక్రమంగా ఓట్లను తొలగిస్తోందని, ఎన్నికల సంఘాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తోందని తీవ్రంగా నిరసించారు. ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ని తొలగించి, ఎన్నికల ప్రక్రియను పూర్తిగా సరిదిద్దేంత వరకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే , లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ఈ పోరాటం నిరంతరాయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికే మొదటి, రెండవ దశలు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ ఉద్యమాన్ని, ఇప్పుడు మూడవ దశ రూపంలో జిల్లాలోని ప్రతి బ్లాక్, బూత్ మరియు గ్రామ స్థాయికి బలంగా తీసుకెళ్లేందుకు పటిష్ట కార్యాచరణను ఖరారు చేశామని వివరించారు.

ఈ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ అధ్యక్షులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా ఖర్గే దిష్టిబొమ్మ దహనం

### ప్రధాని మోదీ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం: బీజేపీ నాయకులు

### రాజ్ భూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో నిరసన.. పాల్గొన్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి




**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, ఆయన కుటుంబ సభ్యులపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, పాపయ్య గౌడ్, తోకల శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, వై. శ్రీధర్, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీని, ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని పదేపదే అవమానకర వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని బీజేపీ నాయకులు విమర్శించారు. రాజకీయాల్లో విమర్శలకు హద్దులు ఉండాలని, వ్యక్తిగత దూషణలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ నాయకులు వెంకటేశ్ గుప్తా, వంశీకృష్ణ, విఠల నరసింహ, మోహన్ సింగ్, మోటే శ్రీను, నరసింహ యాదవ్, శ్రీనివాస్ చారి, హరీష్ ముదిరాజ్, శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్, నరసింహ, నవీన్‌తో పాటు పలువురు జిల్లా, రాష్ట్ర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాండూర్‌కు తెలంగాణ శాసనసభ

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రాక

**ఈ నెల 28న బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ..**

**పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు అండగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి..**

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న శాసనసభ స్పీకర్..**





**తాండూరు అక్షిత ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ, వారి భవిష్యత్తుకు బాటలు వేసే లక్ష్యంతో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలోని బీఎంఆర్ ఫౌండేషన్ మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించడంతో పాటు గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదువు తున్న నిరుద్యోగ యువతకు అవసరమైన స్టడీ మెటీ రియల్‌ను ఉచితంగా పంపిణీ చేయాలని, నిర్ణయించింది. ఈ కార్యక్రమం ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రోత్సాహం అందించడంతో పాటు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా అధ్యయన సామగ్రిని కొనుగోలు చేయలేని, యువతకు కొంతమేర సహాయ పడాలనే ఉద్దేశంతో బీఎంఆర్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది.

ఈ నెల 28వ తేదీ, బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు తాండూరులోని విలియం మూన్ స్కూల్‌లో ఈ ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ద్వారా అధికారిక ప్రకటన విడుదల చేశారు. కానిస్టేబుల్, సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ), గ్రూప్స్‌తో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమ నిర్వాహకులు సూచించారు.

**ముఖ్య అతిథిగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆయనతో పాటు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు పలువురు ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వెల్లడించారు. ప్రజా ప్రతి నిధులు, ఉన్నతాధికారుల సమక్షంలో యువతకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనుండటంతో ఈ కార్యక్రమానికి ప్రాధాన్యత సంతరించుకుంది.

**యువతకు చేయూత అందించడమే లక్ష్యం**

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే ఆశయంతో ఎంతోమంది నిరుద్యోగ యువత పగలు, రాత్రి కష్టపడి చదువుతున్నారు. అయితే పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ కొనుగోలు చేయడం కొంత మంది అభ్యర్థులకు ఆర్థిక భారంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో యువతకు అవసరమైన అధ్యయన సామగ్రిని ఉచితంగా అందించడం ద్వారా వారి సన్నద్ధతకు తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో బీఎంఆర్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది.

యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ప్రభుత్వ ఉద్యోగాల సాధన దిశగా వారిని ప్రోత్సహించడం, పోటీ పరీక్షలకు మెరుగైన సన్నద్ధత కల్పించడంలో సహకరించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెల్లడించింది.

**పోటీ పరీక్షల అభ్యర్థులకు పిలుపు**

కానిస్టేబుల్, ఎస్ఐ, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న తాండూరు ప్రాంత నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియో గించుకోవాలని, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కోరారు. యువత విద్యా, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించడం ఎంతో ముఖ్యమని, ఇటువంటి కార్యక్రమాలు అభ్యర్థులకు ఉపయోగపడతాయని, పేర్కొన్నారు.

కార్యక్రమ వివరాలు, ఈ నెల 28వ తేదీ, బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు తాండూరులోని విలియం మూన్ స్కూల్‌లో బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జరగనుంది. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తదితర ప్రముఖులు పాల్గొననున్నారు.

# వెట్టిచాకిరీ నిర్మూలించాలి

**హెల్ప్ లైన్ 080-80694 34343**





**వరంగల్, అక్షిత బ్యూరో:** వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు,కలెక్టర్,సత్య శారద పేర్కొన్నారు. వెట్టిచాకిరికి గురైన కార్మికులను గుర్తించడం, వారిని రక్షించడం, పునరావాసం కల్పించడం, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించడంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా, సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,మేర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్రాజం,గ్రంథాల చైర్మన్ మీసాల ప్రకాశ్ చే మీ పని,మీ జీవితం,మీ స్వేచ్ఛ అనే గోడపత్రికను ఆవిష్కరించి , వెట్టి చాకిరి పై అవేర్నెస్ కల్పించేందుకు ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు ఇతర అసంఘటిత కార్మిక రంగాల్లో వెట్టిచాకిరీ చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయని వారిని అరికట్టుటకు అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, బాధితులు ఫిర్యాదు చేసేందుకు అందుబాటులో ఉన్న బాండెడ్ లేబర్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 080-69434343 గురించి విస్తృతంగా ప్రచారం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం మన్నారు. స్వేచ్ఛా రథం వరంగల్‌లి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు, ముఖ్యంగా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దంపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహార పథకం ప్రారంభం

**ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ బీసుల లావణ్య రాజేష్**



**మహాదేవపూర్, మంథని, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అల్పాహార (టిఫిన్) కార్యక్రమం సోమవారం పెద్దంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ప్రీరా)లో ఘనంగా ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ బీసుల లావణ్య-రాజేష్ ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభించి, విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఉదయాన్నే పౌష్టికాహారాన్ని అందించాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం ఈ అల్పాహార పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఈ పథకం విద్యార్థుల ఆరోగ్యానికి, వారి హాజరు శాతాన్ని పెంచడానికి ఎంతగానో దోహదపడు తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం రాజు గౌడ్, వార్డు సభ్యులు తడవర్ల మాళవిక, గొరివేణి మల్లేశ్వరి, కుర్సం లక్ష్మణ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గావిడి బాపు, పంచాయతీ కార్యదర్శి ావ. సమ్మయ్య పాల్గొన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు (ఏపీ) బిక్షపతి, ఉపాధ్యాయులు రూప, సునీతలతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ సిఐగా దేవిరెడ్డి సతీష్ రెడ్డి





**చౌటుప్పల్ /అక్షిత న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పట్టణ సీఐగా డి సతీష్ రెడ్డి సోమవారం తన పదవి బాధ్యతలు స్వీకరించారు. శాఖపరమైన బదిలీలలో భాగంగా చౌటుప్పల్ రూరల్ సర్కిల్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న డి.సతీష్ రెడ్డి చౌటుప్పల్ పట్టణ సీఐగా బదిలీ అయ్యారు. ఇంతకాలం చౌటుప్పల్ సీఐగా బాధ్యతలు నిర్వర్తించిన జి.మన్మధ కుమార్ చౌటుప్పల్ రూరల్ సర్కిల్ సీఐ గా బదిలీ అయ్యారు. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఇంటి నిర్మాణానికి గోలి శ్రీనివాస్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** వెల్దండ మండల పరిధిలోని రాచూర్ గ్రామానికి చెందిన మల్లోజు మంజుల ఇంటి నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం 10,000/-వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులోనూ తన కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్,నాయకులు బుచ్చిబాబు, గూళ్ల వెంకటేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## బాలోత్సవ్-2026 పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం నగరంలో నవంబర్ 11, 12వ తేదీలలో ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ వారధి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాలోత్సవ పోటీలకు సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య తో కలిసి బాలోత్సవ్ -2026 పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మంలో రాష్ట్ర స్థాయి బాలోత్సవ్ పోటీలను నిర్వహించి పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. ఉమ్మడి జిల్లా రాష్ట్రంలోని నలుమూలల నుంచి పిల్లలు ఈ బాలోత్సవంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల్ నాగరాజు జిల్లా నాయకులు చిక్కుళ్ల వెంకటేష్ పగిల్లపల్లి రాజు ప్రసాద్ రాజేష్ భవాని శంకర్ ముకేశ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు రిజిస్ట్రేషన్ల కోసం సెల్ 9177630682, 8328277244 నంబర్స్‌ని సంప్రదించగలరని ఆర్గనైజింగ్ కమిటీ తెలియచేసింది.

## దురదృష్టవశాత్తు రెండు కాళ్లు పోయాయి

### బాధితునికి అదునాతన వీల్ చైర్ అందజేత



**వరంగల్, అక్షిత బ్యూరో:** వర్ధన్నపేటకు చెందిన గిద్దె గండ్ల విష్ణు వయసు 27 సంవత్సరాలు, ప్రమాదవశాత్తు రెండు కాళ్ళు పోయాయి, అంగవైకల్యంతో బాధపడుచున్నాడనీ. ఈ విషయం తెలుసుకున్న సామజిక సేవ సంస్థ వ్యవస్థాపకుడు ఎలుకపెల్లి శ్రీధర్ ధాత అకింత్ ను సహాయం కోసం ఒక వీల్ చైర్ కోరగా, వెంటనే వారు పుట్టినరోజు సందర్బంగా విష్ణు కి వీల్ చైర్ అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో తడుగుల చక్రి, ఎలుకపెల్లి రేవంత్, పాల్గొన్నారు.

## బల్మూర్ మండల కేంద్రంలో పత్తి చేలకు వెళ్తున్న పిల్లలకు విముక్తి



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** పత్తి చేలకు తరలి వెళ్తున్న బడి బయటి పిల్లల అధికారులు విముక్తి కల్పించారు. వివరాల్లోకి వెళితే బల్మూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో ఇతర ప్రాంతాల నుండి బుల్లోరా, ఆటో ,ట్రాక్టర్ , వాహనాలలో 22 మంది పిల్లలు పత్తి చేలకు వెళ్తున్న వారిని విముక్తి కల్పించడం జరిగింది. విద్యాశాఖ, పోలీస్ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్, స్వచ్ఛంద సంస్థ కోనేరు, ఆధ్వర్యంలో సంయుక్తంగా వివిధ ప్రాంతాలు లింగాల, క్యాంపు రాయవరం, దారారం, బల్మూర్, ప్రాంతాల పిల్లలను విముక్తి కల్పించి వారిని వారి వారి పాఠశాలలకు తిరిగి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మల్లేష్, పోలీస్ శాఖ పిసి ప్రసాద్, కోనేరు స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్లు జాకీర్ హుస్సేన్ శ్రీనివాసులు శివుడు, సర్పంచి భర్త మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మేయర్ కోలగాని శ్రీనివాస్

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** నగర అభివృద్ధే ధ్యేయంగా తమ పాలకవర్గం పని చేస్తుందని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా సోమవారం 1,2,32,33 డివిజన్లలో మేయర్ కొలగాని శ్రీనివాస్ పర్యటించారు. మొదటగా 2 వ డివిజన్ తీగలగుట్టపల్లిలో నగరపాలక సంస్థకు చెందిన 11 లక్షల సాధారణ నిధులతో ఎస్ డబ్లుజీ పైపులైన్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమీ పూజ చేశారు. అనంతరం 32 వ డివిజన్ హుస్సెన్ పురలో స్థానిక కార్పోరేటర్ షేక్ యూసూఫ్ తో కలిసి 20 లక్షల యూఐడీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. 34 వ డివిజన్ హుస్సెన్ పురలో స్థానిక కార్పోరేటర్ సమీనా పర్వీన్ తో కలిసి యూఐడీఎఫ్ కు చెందిన 10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమీ పూజ చేశారు. అనంతరం 1 వ డివిజన్ ఆరెపల్లిలో స్థానిక కార్పోరేటర్ బారి అపర్ణ జితేంధర్ తో కలిసి నగరపాలక సంస్థ కు చెందిన 27 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. పనులు ప్రారంభోత్సవాలు చేసి పనులు స్టాట్ చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం సంబందిత డివిజన్లలో ప్రజలు దృష్టికి తెచ్చిన సమస్యలను తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సంధర్బంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ తమ పాలకవర్గం ఏర్పడిన నుండి అన్ని డివిజన్లలో వివిధ గ్రాంట్ల నుండి వందల కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధి పనుల పరంపరా కొనసాగిస్తున్నామని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో సలహాల సూచనల మేరకు అన్ని డివిజన్లను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. యూఐడిఎఫ్ కింది 50 కోట్లతో డివిజన్ల వారిగా అభివృద్ధి పనులు ప్రారంభించి ప్రజలకు కావల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. తమ పాలకవర్గం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నగరంలో అభివృద్ధి పనులు చేపట్టి సుంధర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతుందని తెలిపారు. అంతే కాకుండా నగరపాలక సంస్థ నిధులు, అర్థిక సంఘం నిధులతో కూడ పలు డివిజన్ల లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు ప్రారంభం చేశామని తెలిపారు. చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. 32 వ డివిజన్ హుస్సెన్ పుర ప్రాంతంలో మరో 30 లక్షల నిధుల కు సంబంధించిన పనులను కూడ త్వరలోనే ప్రారంభం చేస్తామని తెలిపారు. 34 వ డివిజన్ అభివృద్ధి కి కూడ యూఐడిఎఫ్ కింద ఇప్పటికే నిధులు కేటాయించి పనులు ప్రారంభం చేశామని తెలిపారు. 1, 2 డివిజన్లలో కూడ యూఐడిఎఫ్ లో నిధులు కేటాయించి పనులను ప్రారంభం చేశామని, మరిన్ని నిధులతో పెండింగ్ సమస్యలను కూడ దశల వారిగా పరిష్కరిస్తామని తెలిపారు. పార్టీలకు అతీతంగా మా పాలకవర్గం డివిజన్ల అభివృద్ధి కోసం నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తూ ముందుకు సాగుతుందని తెలిపారు. నగర అభివృద్ధి ప్రజల రక్షణే మా పాలకవర్గం ప్రధాన ధ్యేయం అని తెలిపారు. ప్రజలకు కావల్సిన వసతులు కల్పించి వారి అవసరాలను తీర్చడమే లక్ష్యంగా పాలకవర్గం పని చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులు, స్థానిక డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

# నేటి ప్రజావాణికి 33 దరఖాస్తులు

### ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన 100 శాతం ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలి

### జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్





**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు బి చేన్నయ్య, దేవ సహాయం, డిఆర్ఓ పండు తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్వీకరించారు.

ఈ సందర్భంగా నేటి ప్రజావాణికి 33 దరఖాస్తులు స్వీకరించారు, ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదుకు ప్రాధాన్యతనిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

అనంతరం ...... జిల్లాలో ఎఫ్ఆర్ఎస్ (ఖీ=చా) విధానాన్ని 100 శాతం అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని శాఖల్లో ఎఫ్ఆర్ఎస్ అమలు పక్కాగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎఫ్ఆర్ఎస్ అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, విధుల నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

శాఖల వారీగా రోజువారి అటెండెన్స్ ను సమీక్షించిన కలెక్టర్ కొన్ని శాఖల ఎఫ్ ఆర్ ఎస్ పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విధిగా సిబ్బంది 100% ఎఫ్ ఆర్ ఎస్ విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించరా?

**అధికారిపై కలెక్టర్ ఆగ్రహం......**

**సస్పెన్షన్‌కు ఆదేశాలు**

**75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందిస్తున్నా రైతుకు తెలియని వైనం**

**మార్చాల గ్రామంలో వ్యవసాయ క్షేత్రం,డైరీ ఫామ్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన రైతులకు చేరేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందని, అయితే క్షేత్రస్థాయిలో రైతులకు కనీస అవగాహన కల్పించకపోవడంపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పశుపోషణ ద్వారా జీవనోపాధి పొందుతున్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీల గురించి తెలియక, వారు ప్రైవేటుగా అధిక ధరలకు గడ్డి విత్తనాలు కొనుగోలు చేస్తున్న విషయాన్ని గుర్తించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన మండల పశుసంవర్ధక శాఖ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసి, సంబంధిత జిల్లా అధికారికి సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీ చేశారు.

కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామంలో సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పర్యటించి రైతులు చేపడుతున్న వ్యవసాయ, పశుపోషణ కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు, వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా వారు పొందుతున్న ప్రయోజనాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.

ముందుగా మార్చాల గ్రామానికి చెందిన రైతు తాజుద్దీన్ తన వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసుకున్న ఫామ్ పాండ్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వ్యవసాయానికి నీటి వనరులను వినియోగించుకునేందుకు చేపట్టిన ఈ ఏర్పాటు గురించి రైతును అడిగి వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలో చేపడుతున్న కార్యకలాపాలు, నీటి వినియోగం తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు.

అనంతరం అదే గ్రామానికి చెందిన రైతు కృష్ణయ్య మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్వహిస్తున్న డైరీ ఫామ్‌ను సందర్శించారు. పశువుల పెంపకం, వాటి పోషణ, పశువులకు అవసరమైన దాణా, పచ్చిమేత అందుబాటు వంటి అంశాలను కలెక్టర్ రైతులు అడిగి తెలుసుకున్నారు. డైరీ ఫామ్ నిర్వహణ ద్వారా రైతు పొందుతున్న ప్రయోజనాలు, పశుపోషణలో ఎదురవుతున్న సమస్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా సబ్సిడీపై గడ్డి విత్తనాలను సరఫరా చేస్తున్నప్పుడు ప్రైవేటుగా ఎందుకు కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ రాయితీని ఎందుకు వినియోగించుకోవడం లేదని ఈ అంశంపై కలెక్టర్ ఆరా తీశారు.

అందుకు రైతు స్పందిస్తూ, ప్రభుత్వం నుంచి సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్న విషయం తమకు తెలియదని, ఈ పథకం గురించి సంబంధిత అధికారులు ఎవరూ తమకు సమాచారం ఇవ్వలేదని తెలిపారు.

దీంతో రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంలో అధికారుల పనితీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు సరఫరా చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పశుపోషక రైతులకు ఆ సమాచారం తెలియకపోవడంపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే పథకాల గురించి తెలియజేయాల్సిన బాధ్యత అధికారులకు లేదా అని ప్రశ్నించారు.

రైతులు పశువుల మేత కోసం అవసరమైన గడ్డి విత్తనాలను ప్రైవేటుగా కొనుగోలు చేస్తున్నప్పుడు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ గురించి వారికి తెలియజేయకపోవడం ఏమిటని సంబంధిత అధికారులను కలెక్టర్ నిలదీశారు. క్షేత్రస్థాయిలో రైతులతో నిరంతరం సంబంధాలు కలిగి ఉండి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వారికి వివరించాల్సిన అధికారులు ఆ బాధ్యతను ఎందుకు నిర్వర్తించలేదని కలెక్టర్ ప్రశ్నించారు.

ప్రభుత్వం రైతుల కోసం పథకాలు అమలు చేయడమే కాకుండా, వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రతి రైతుకు చేరేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు భావించిన మండల పశుసంవర్ధక శాఖ ఏవో డాక్టర్ నాగరాజును సస్పెండ్ చేయాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.

వ్యవసాయ శాఖ ఏఈఓ సురేష్ కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ, డైరీ ఫామ్‌ల నిర్వహణ ద్వారా అదనపు ఆదాయం పొందేందుకు ప్రభుత్వం వివిధ పథకాలు, రాయితీలు అందుబాటులోకి తీసుకువస్తోంది. అయితే, ఆ పథకాల గురించి రైతులకు సరైన సమాచారం అందకపోతే వాటి ప్రయోజనాలు ఆశించిన స్థాయిలో అందవు అని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

జిల్లా కలెక్టర్ వెంట సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి,, ఎమ్మార్వో ఇబ్రహీం, ఎంపీడీవో యాదయ్య, మార్చాలా పంచాయతీ సెక్రెటరీ రమేష్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. మండల స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** యాదాద్రి జిల్లా, చౌటుప్పల్ పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మందోళ్ల గూడెం, ఎస్ లింగోటం, నేలపట్ల, అంకిరెడ్డిగూడెం, నక్కలగూడెం గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, జిల్లా సహకార అధికారి కే నాగార్జున, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ ఈదుదుల మస్తాన్ బాబు యాదవ్ లు సోమవారం వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యంలో తాలు, మట్టిపెడ్డలు రాళ్లు లేకుండా చూసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని రకాల వసతులు కల్పించినట్లు తెలిపారు. రైతుల తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలని, మధ్య దాలర్లకు అమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, పిఏసిఎస్ వైస్ చైర్మన్ పర్నె శివారెడ్డి , ఏ ఆర్ సురేష్, సింగిల్ విండో డైరెక్టర్లు బొబ్బిళ్ళ రాజేందర్,సుర్కంటి లక్ష్మమ్మ, జక్కిడి వెంకటరెడ్డి,నల్ల నరేందర్ రెడ్డి,రావుల స్వామి,గుర్రం మనోహర్ రెడ్డి, మల్కాపురం సుగుణమ్మ, మేకల దేవేందర్ రెడ్డి,బత్తుల శ్రీహరి, ఆయా గ్రామాల సర్పంచులు తంగేళ్ల వెంకటేశం, గంగాపురం వసంత, నాగేష్ గౌడ్,భీమిడి ప్రదీప్ జి, సుర్వి మల్లేష్ గౌడ్, ఉప సర్పంచులు పిన్నింటి శ్రీనివాస్ రెడ్డి, సుర్కంటి శ్రీధర్ రెడ్డి, బాదరాజు ధనుంజయ లు, ఏఎంసీ డైరెక్టర్లు పబ్బు శ్రీకాంత్, ఢిల్లీ చంద్రకళ, మాజీ ఎంపిటిసి రాజశేఖర్ రెడ్డి,చెన్నగొని అంజయ్య గౌడ్, శంకర్, వెంకటరత్నం, వై రమేష్,గ్రామాల వార్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తాం

**ముత్యాల సునీల్ కుమార్‌నీ కలిసి ఘనంగా సన్మానించిన భీంగల్ కాంగ్రెస్ వార్డు అధ్యక్షులు**



**భీంగల్, అక్షిత న్యూస్:** బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ నీ భీంగల్ పట్టణానికి 12 వార్డు ల అధ్యక్షులు మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భీంగల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పర్స అనంతరావు,12 వార్డు ల అధ్యక్షులు, చెప్పాల గణేష్, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు అరిగెల జనార్దన్, 11వ వార్డు కౌన్సిలర్ సంగ్య నాయక్, 8వ వార్డు కౌన్సిలర్ మమ్మరి సందీప్, మండల అధికార ప్రతినిధి వాక మహేష్, బాబాపూర్ ఉపసర్పంచ్ మంద గోవర్ధన్, ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సేవలాల్, బైండ్ల మహేష్, సందు పవన్, రాము బింగివర్, యాదగిరి వంశీ, మొండి దినేష్ తో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు..

**వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్‌లో**

## బాలల హక్కులు, పోక్సో చట్టంపై న్యాయ అవగాహన సదస్సు





**రామన్నపేట,అక్షిత ప్రతినిధి:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ యాదాద్రి భువనగిరి వారి ఆదేశాల మేరకు రామన్నపేట మండల కేంద్రంలోని వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్ ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం “సురక్ష బచ్‌పన్ అభియాన్ -- బాలల హక్కులు, పోక్సో చట్టం--2012” అంశంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. సబిత హాజరై విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే తమ హక్కులు, బాధ్యతలు, చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని, బాలికల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాలను వివరించారు. ఆపద సమయంలో సహాయం పొందేందుకు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ సహాయం, న్యాయ సహాయం కోసం 15100 టోల్‌ఫ్రీ నంబర్లను ఎలా వినియోగించుకోవాలో తెలియజేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, ఇంటర్నెట్, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు సోషల్ మీడియాను జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, తమ భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి ఉపయోగించుకోవాలని వక్తలు సూచించారు. అనవసరమైన విషయాలకు దూరంగా ఉంటూ చదువుపై పూర్తి శ్రద్ధ పెట్టాలని, ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు తిరుగుడు మల్లికార్జున్, న్యాయవాదులు జినుకల ప్రభాకర్, మామిడి వెంకట్ రెడ్డి, సతీష్ రెడ్డి, కూనూరు శ్రీనివాస్, పారా లీగల్ వాలంటీర్ కురిమేటి యాదయ్య, లీగల్ ఎయిడ్ క్లినిక్ విభాగానికి చెందిన కానుగంటి శ్రీశైలం, పోలీస్ శాఖ, చైల్డ్ లేబర్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రిన్సిపల్ వెలిమినేటి మల్లేష్, వైస్ ప్రిన్సిపల్ అస్మా సదస్సులో పాల్గొని, విద్యార్థులకు ఉపయోగకరమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన మండల లీగల్ సర్వీసెస్ కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు నాగరాజు, ముత్యాలు, స్వామి, సాయివిద్యాసాగర్, సుధారాణి, శాంతి, సునీత, అనిత, రాజేశ్వరి, సరిత, పారిజాత, పావని, సాహితి, ఉమా, గాయత్రితో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పొరపాట్లకు తావివ్వొద్దు

## పోలీస్ అధికారులు, సిబ్బంది పక్కడ్బందీగా పనిచేయాలి

### ఓన్ టౌన్ తనిఖీలో డిఎస్పీ రవి



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** పోలీసు అధికారులు పకడ్బందీగా పని చేయాలని మిర్యాలగూడ డిఎస్పి జి.రవి కోరారు. సోమవారం ఒన్ పోలీస్ స్టేషన్‌ను ఇన్స్పెక్షన్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవి క్రైమ్ రికార్డులు, రిజిస్టర్లు, డేటా నిర్వహణ, అవుట్‌డోర్ పోలీసింగ్‌కు సంబంధించి సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. అన్ని క్రైమ్‌కు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, కేసు ఫైళ్ళు, సంబంధిత పత్రాలను నిర్దేశించిన పోలీస్ మాన్యువల్, స్టాండింగ్ ఆర్డర్స్, శాఖాపరమైన ఆదేశాల ప్రకారం



క్రమబద్ధంగా, సక్రమంగా నిర్వహించాలన్నారు.

అన్ని రికార్డులు, రిజిస్టర్లలో చేయవలసిన ఎంట్రీలను నిర్ణీత సమయంలో, పూర్తి వివరాలతో ఎటువంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. చేయవలసిన ఏ ఎంట్రీ కూడా పెండింగ్‌లో ఉంచకూడదు లేదా మిస్ కాకుండా చూడాలన్నారు.

అన్ని రికార్డులు, సంబంధిత డేటాను ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో అప్‌డేట్ చేయాలన్నారు. భౌతిక రికార్డులు, సంబంధిత డిజిటల్ డేటాను పరస్పరం సరిచూసి, వాటి మధ్య ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా చూడాలన్నారు.

షెడ్యూల్, ఆర్టికల్‌ఒకటి నుండి 5 వరకు ఉన్న అన్ని రికార్డులను పూర్తిగా పరిశీలించి, నిర్దేశించిన విధానంలో నిర్వహించాలి. ప్రతి రికార్డు ఉద్దేశ్యం, అందులో నమోదు చేయవలసిన వివరాలు, నిర్వహణ విధానం, ఎంట్రీలు చేసే విధానం గురించి సంబంధిత సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు.

క్రైమ్ కేసులకు సంబంధించిన రికార్డులు, ఎఫ్ఐఆర్ లు, క్రైమ్ నంబర్లు, దర్యాప్తు వివరాలు, నిందితులు, సాక్షులు, కేసు ఆస్తి, కోర్టు వ్యవహారాలు, కేసుల డిస్పోజల్, పెండింగ్ కేసులను సత్వరం పూర్తి చేయాలన్నారు. తొలుత స్టేషన్లో గౌరవ వందనం స్వీకరించి ఆయుధాలు, యూనిఫామ్, తదితర సామాగ్రి పరిశీలించారు. ఆయన వెంట ఇన్స్పెక్టర్ ఎం.నాగభూషణం, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

## సమాజంలో వెట్టి చాకిరీ వంటి అమానవీయ విధానాలను పూర్తిగా నిర్మూలించాలి

### బాధితులకు విముక్తి కల్పించడమే లక్ష్యంగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని

### కలెక్టర్ దీపక్ తివారి పిలుపునిచ్చారు



**వికారాబాద్ , అక్షిత బ్యూరో:** కలెక్టరేట్ ఆవరణలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాండెడ్ లేబర్ (వెట్టి చాకిరీ) నిర్మూలన ప్రత్యేక ప్రచార వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెట్టి చాకిరీ నిర్మూలనకు కృషి చేయడం, చట్టాలను నిష్పక్షపాతంగా అమలు చేస్తూ బాధితులకు న్యాయం అందించడం, సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు నిబద్ధతతో పనిచేయడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... వెట్టి చాకిరీ వంటి అమానవీయ విధానాలకు సమాజంలో ఎలాంటి చోటు ఉండకూడదని స్పష్టం చేశారు. వెట్టి చాకిరీకి గురవుతున్న బాధితులను గుర్తించి వారికి విముక్తి కల్పించడంతో పాటు, పునరావాసం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా తగిన సహాయం అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాధితుల హక్కులను పరిరక్షిస్తూ వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక ప్రచార వాహనం ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వెట్టి చాకిరీ నిర్మూలన, బాధితుల హక్కులు, సంబంధిత చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా వెట్టి చాకిరీ ఘటనలు చోటుచేసుకున్నా, బాధితులు తమ దృష్టికి వచ్చినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. మానవ హక్కులను గౌరవిస్తూ వెట్టి చాకిరీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు, కార్మిక శాఖ అధికారి వాల్య నాయక్, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు మాధవరెడ్డి, జయపాల్ రెడ్డి, హైదరాబాద్ నుంచి వచ్చిన కళాకారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## తిరుమలగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వెంకట లక్ష్మారెడ్డి

### తొండ నాయకుల ఘన సన్మానం



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి :** తిరుమలగిరి కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కేసిడి వెంకట లక్ష్మారెడ్డిని తొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. పట్టణ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్న నాయకులు, శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వెంకట లక్ష్మారెడ్డి నాయకత్వంలో తిరుమలగిరి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, పార్టీ అభివృద్ధికి ఆయన తన వంతు కృషి చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు.

అనంతరం నూతన అధ్యక్షుడు వెంకట లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్టానానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని పోతూ పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదుకు కృషి చేద్దాం

### ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ భాగస్వాములై అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు అయ్యేలా కృషి చేద్దామని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా 60వ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో సోమవారం రోజున పట్టభద్రులను కలిసి ఓటరు నమోదు కోసం అవసరమైన ఫారం-18ను అందజేశారు. అర్హులైన పట్టభద్రులందరూ ఫారం-18 ద్వారా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని ఆయన సూచించారు.

పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన వారందరూ నమోదు చేసుకునేలా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఇప్పటికే సూచించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల డివిజన్ ఇంచార్జ్ రఘు, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ బాధ్యులు జనార్దన్, డివిజన్ సీనియర్ నాయకులు తోట నవీన్, విజయపాల్ కాలనీ బీఎల్‌ఏ విష్ణు, టీచర్స్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

## వలసకు తరలిస్తున్న చెంచుల విముక్తి కల్పించిన అధికారులు

### రాత్రి సమయంలో వలసకు వెళ్తుండగా

### అచ్చంపేట డిఎస్పి శ్రీనివాస్ కృషి వల్ల అడ్డుకట్ట

### వలస కూలీలు అధికారులకు అప్పగించిన పోలీసులు



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లాలోని అప్పాయపల్లి పద్మన్నపల్లి చెన్నంపల్లి గ్రామలలోని చెంచులను వలసపేరుతో తరలిస్తుండగా ఆదివారం రాత్రి అచ్చంపేట డిఎస్పి శ్రీనివాస్ కృషి వల్ల వలస కు వెళ్తున్న కూలీలకు విముక్తి కల్పించారు. దాదాపు ఇప్పటివరకు 100 కుటుంబాలకు పైగా చెంచులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఇట్టి నిరుపేద కుటుంబాలు గ్రామంలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వలస బాట పట్టారు. ఆదివారం రాత్రి నమ్మదగిన సమాచారం అచ్చంపేట డిఎస్పి శ్రీనివాస్ ఆదేశాల మేరకు లింగాల పోలీసులు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసు పోలీసు బృందంతో వెళ్లి వలస వెళ్తున్న కూలీలకు విముక్తి కల్పించి మండల ఎంపీడీవో కార్యాలయంలో రాత్రి వారికి బస చేసేందుకు షెల్టర్ కల్పించారు. సోమవారం లింగాల మండల తహసీల్దార్ బి వెంకటేష్, మండల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, కూలీలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం తీసుకువెళ్తున్న గుంపు మేస్త్రీ పై ఆగ్రహం వ్యక్తం చేశారు . గిరిజన చెంచులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్థానికంగా ఉండండి మీకు ప్రభుత్వం ద్వారా స్థానికంగా పనులు కల్పిస్తామంటూ గిరిజనులకు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించి వారిని వారి స్వగ్రామాలకు తరలించారు. ఇకనుంచి ఎవరైనా గిరిజన కుటుంబాలను వలస తీసుక వెళితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు విజయ, శ్రీశైలం, శ్రీరంగాపూర్ ఉపసర్పంచ్ రేన య్య , తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.